పూర్తిగా తెలుసు. ముందుగానే రాజీనామా పంపారు ఉద్యోగానికి. ఆనాటినుండీ ఎన్ని అవకాశాలు వచ్చినా ఉద్యోగం మరి తలపెట్టలేదు. తల అమ్ముకొని షడ్రసోపేతా లారగించడంకంటె స్వేచ్ఛగా వుండి పస్తుపడుకోవడమైనా వుత్తమమే అని గ్రహించారు. దరిద్రదేవత ఇంట కాపురం పెట్టింది. తన సామర్థ్యమంతా పూర్తిగా వినియోగించింది. కాని కవిగారి ధైర్యకవచాన్ని మాత్రం ఛేదించలేకపోయింది. శాస్త్రిగారికి వున్న సంతృప్తి లక్షాధికారికి కూడా వుండదు.

పాతికేండ్లక్రిందట విశాఖపట్నంలో పీర్లపండుగ సాటిలేకుండా సాగుతూ వుండేది. అయితే మహమ్మదీయులు కాదు దీనికి కారణం; హిందువులు. తమ స్వమతాన్ని, తమ పురాణపీఠాన్ని మరచిపోయి పీర్లపండుగలో తన్మయులవుతూ వుండే హిందువుల సంగతి పరికించి శాస్త్రిగారు కన్నీళ్లు కార్చారు. ఎలాగు వీరిని ప్రబుద్ధుల చేయడమన్న వ్యాకులభావంతో ఇతరచింతలు మరచిపోయి కార్యరంగంలో దిగి రామలీలామహోత్సవం స్థాపించారు. దిగ్విజయంగా వుత్సవాలు జరిగాయి; జరుగుతున్నవి. అయితే అంతతో పోలేదు. శాస్త్రిగారిని హతమార్చడానికి ప్రయత్నాలు జరిగాయి. వీరి ఆడిమందిరానికి చిచ్చు ముట్టించారు. ఒంటరిగా శాస్త్రిగారు వస్తూంటే చంపడానికి మార్గంలో దాగున్నారు. కాని ఈ తేజస్విని సమీపించడానికి మాత్రం సాహసం లేకపోయింది వారికి. కాలక్రమంగా శాస్త్రిగారి సహృదయం గుర్తించి ద్రోహచింతను తెగించినవారు పశ్చాత్తప్తులైనారు. ఇలాంటి ఘట్టాలు శాస్త్రిగారి జీవితంలో మరికొన్ని కూడా వున్నవి.

మెట్రిక్యులేషను పరీక్షకు చదువుతూన్నపుడే కాంగ్రెసుకిపోట్టు చదవడం తటస్థించింది శాస్త్రిగారికి. దేశస్థితికి ఒళ్ళు జలదరించింది. పట్టభద్రులై, ఉన్నతోద్యోగం సంపాదించవలెనన్న సంకల్పం హృదయంలో నశించిపోయి దేశారాధన చేయవలెనన్న ప్రతిజ్ఞ నెలకొన్నది. నాటినుండీ నేటివరకూ వీరు చేసిన నిరాడంబర దేశసేవ ప్రత్యేక మొక గ్రంథమవుతుంది. గ్రంథాలయోద్యమమూ, స్వదేశీ ఉద్యమమూ, మతప్రచారమూ, సంఘసేవా, జాతీయవిద్యాప్రబోధనమూ—ఒకటేమిటి? విశాఖపట్నంజిల్లాలో సాగిన దేశహితైకకార్యమేది చెప్పవలసివచ్చినా శాస్త్రిగారిని మొదట చెప్పక తీరదు. సత్యాగ్రహసమరంలో జిల్లానియంతగా రెండుసార్లు కారాగృహవాసం అనుభవించారు శాస్త్రిగారు.

ఎంతటి కష్టాలలోనూ మందహాసం తొలగిపోదాయన పెదవులనుండి. కష్టాలలో దుఃఖించడమంటే ఎరుగనే ఎరుగరు శాస్త్రిగారు. కనుకనే జీవితంలో ఏమాత్రం ఒడుదుడుకులు వచ్చినా క... తపడిపోయే నన్ను చూచి జాలిపడుతుంటారు.

తెనుగుభాషారాధకులలో శాస్త్రిగారిని చెప్పి మరొకరిని చెప్తాను. తెనుగుతనం గురించీ, తెనుగుబాస గురించీ సంభాషించేటపుడు ఒక క్రొత్త తేజస్సు ఆయన నేత్రాలనుండి వెలువడిపోతూవుంటుంది. ఆవేశంతో గొంతుక గద్గదికపడుతుంది. సంభాషణలో ఇంగ్లీషు పద మొక్కటి కూడా దొరలకపోవడం చూస్తే కొత్తవారు వీరికి ఆంగ్లభాషాపరిచయమే లేదనుకుంటారు. ఇగ్లీ[illegible] సహా ఇంగ్లీషు మిళాయించి మాట్లాడే మన విద్యార్థులను చూ[illegible] ఆయన ఖేదపడనిరోజుండదు. ప్రపంచభాషలతో సమానస్థానం ప్రతిష్ఠించలేనా తెనుగుతల్లికి అని ఈ నాడాయన కంటూన్న సుస్వప్నాలు. అందుకనే ఆయన అనేకభాషల్లో కృషిచేస్తున్నారు. భాషాతత్వశాస్త్రం వ్రాశారు. కవితాసమితికి అధ్యక్షతవహించారు. తెనుగుగుడి స్థాపించారు. జైల్లో సైతం కాలహరణం చేయక భారతభాషాసమితిని నెలకొల్పారు. తెనుగుస్వతంత్రభాష కాదనీ, తెనుగుకు ఉత్పత్తిలేదనీ, సంస్కృతమే తల్లిభాషనీ, వాదించే మనపండితమ్మన్యులను కవిగారేనామా క్షమించలేరు.

సాధనసామగ్రి లేక తెనుగు ఉత్పత్తులు చూపడం విడిచిపెట్టమని సూర్యారాయాంధ్రనిఘంటుకారులు ముచ్చుపదాలపీఠికలో వ్రాశాక శాస్త్రిగారు ఉత్పత్తి, వ్యుత్పత్తులు చూపుతూ తెనుగు నిఘంటువును వ్రాయడానికి పూనుకున్నారు. ఉత్సాహంతో సాధనసామగ్రి చేర్చుకుంటున్నారు. అన్యభాషల సంపర్కం తెలుసుకుంటున్నారు. పల్లెపల్లెలనుండీ తెనుగుపద సముదాయం ఏరుకుంటున్నారు. పోషించడానికి మహారాజులు లేరే అన్న అధైర్యమేమాత్రమూ లేదీ కార్యశూరునికి.

డిగ్రీలు లేనందే తేరిచూడని ఈ తెనుగుదేశమే కాకపోయివుంటే కవిగారు చేస్తూన్న కృషి ఈ పాటికే గమనించి శిరస్సుమీద పెట్టుకొని వుండేవారు. కానీండి. కాలమెన్నాళ్లు కళ్లుమూసుకుంటుంది!

ఇతరులను ఆశ్రయించకపోవడమూ, డిగ్రీలకూ, బిరుదులకూ విముఖులై వుండడమూ, సత్యమును నిర్భయంగా ప్రకటించడమూ లోపాలని కొందరంటారు. ఒప్పుకుందాం.

స్వేచ్ఛాయియైన వీరి మనుగడను గమనించీ ఉపదేశాలను గ్రహించి ఎందరో మంచిప్రవర్తనను అలవరచుకొన్నారు. మెత్తనివాళ్ళి[illegible] మినహాయిస్తే నియంతలకుండవలసిన ఎన్నో లక్షణాలున్నాయి శాస్త్రిగారిలో.

పురిపండా అప్పలస్వామి

---

## రెవ్యూ నిమిత్తం పుస్తకాలు పంపేవారు ఈసంగతి గుర్తించకోరుతాము

రెండు ప్రతులు వచ్చిన పుస్తకమే రెవ్యూ చెయ్యబడుతుంది. ఇతర్లచేతకూడా రెవ్యూ చేయిస్తాం. ఎలాంటి సందర్భంలోనూ పునర్విమర్శలు ప్రకటించము. ఇందుకు అంగీకరించలేనివారు పుస్తకాలు పంపవద్దు

సంపాదకుడు

# అనుకరణము

కృష్ణకుమారి గారు

లోకంలో సాధారణంగా పెద్దవారిని చూచి పిన్నవారు, గొప్పవారిని చూచి కొద్దివారూ, వారెలాగుచేస్తే తామలాగు చేయడానికి ప్రయత్నించడం సర్వసామాన్యము. ఒకరు చేసినదాని నింకొకరు చేయుటకే 'అనుకరణ' మంటారు. ఇది సంస్కృతపదం. ఇంగ్లీషు లో దీనిని Imitation అంటారని నే వ్రాయ నక్కఱలేదు. తెలుగులో నాకుతెలిసినంతవఱకు దీనికి సరియైన పదం దొరకక పోవుటచే సంస్కృతపదమునే వాడుతున్నాను. ఇలాగ అనుకరించేవారు 'అనుయాయులు' అనిపించుకుంటారు. ఆంగ్లంలో 'Imitators' అంటారు.



ఇక ఈ 'అనుకృతి' అనేది అంటురోగమని కొందఱితలంపు "ఇది పిచ్చికుక్క కాటువలె సాంక్రామికము" అని వారివాదము. 'కాదు, అనుకృతి చాలా దొడ్డ గుణం, దానిలో నేర్పు సంపాదించుట కూడా ఒకకళే' అని ఇంక కొందఱివాదము. పరిశీలిస్తే రెండు వాదాలు సమంజసంగానే తోస్తాయి.

సృష్టి కిది సహజస్వభావం లాగ కన్పడుతుంది. మానవుని అను...స్తూ, ఆమానవునకు మానవుడే పుట్టును. అలాగే జంతుజాలానికి ...తుజాలమే జన్మిస్తుంది. పక్షిగణానికి పక్షిగణమే ప్రభవిస్తుంది. ...ది అనుకరణము కాదూ? ఇంకొకటి చూడండి—కడచిన వర్షా...కాలాన్ని రాబోయే వర్షాకాల మనుకరిస్తుంది. చైత్రంలో పూచి ...ష్మంలో కాస్తూన్న మామిడి ననుకరిస్తూ రాబోవు చైత్రంలో ...మామిడి పూచి గ్రీష్మంలో కాస్తూంది. ఇలాగు చూస్తే అను...ణము సృష్టిస్వభావ మనిపిస్తుంది.

ఇంకొకటి చిత్రము:—సృష్టికి ప్రతిసృష్టి! బ్రహ్మసృష్టికి విశ్వా...త్రసృష్టి గొప్ప అనుకరణము. స్వర్గానికే ప్రతిస్వర్గము త్రిశంకు ...ము. మల్లిపూవులకు అడవిమల్లెలు, జాజులకు విరజాజులు, ఆవు...గేదె, గుఱ్ఱమునకు గాడిద, మేకకు గొఱ్ఱె, లేడికి దుప్పి, మామి...జీడిమామిడి, చింతకు సీమచింత, నేతికి నూనె, పులికి చిరుత ... ఇల్లా గన్నో సృష్టికే ప్రతిగ విశ్వామిత్రసృష్టి వెలసింది నేటి ...ంలో నోట్లకు దొంగనోట్లు సృష్టింపబడుతూన్నట్లు.

వాఙ్మయస్థితి చూద్దాము. వాఙ్మయమున కనుకృతి తప్పని తద్దిన...ది. ప్రపంచవాఙ్మయాలన్నీ సామాన్యంగా ఒండొంటి ననుకరిస్తూనే ఉంటాయి. ఇది 'విధి' అని చెప్పలేము. సంస్కృత వాఙ్మయంలో వేదాలు, పురాణాలు, కావ్యాలు, నాటకాలు, ప్రబంధాలు అని ఒకక్రమం ఏర్పడింది. తెలుగులోనూ అంతే కాదూ? మొదట పంచమవేదమైన భారతం, ఆపైన భాస్కరాదులచే రామాయణాది పురాణాలూ ఆంధ్రీకరింపబడినాయి. ఆపిమ్మట కావ్యోత్పత్తి యైంది. అటుపైన గాని నాటకాలు పుట్టలేదు. ఆంగ్లవాఙ్మయంలో కూడా నాటకాలు కడపటికే పుట్టాయి.

అస లొకకాలపు వాఙ్మయోత్పత్తి వికాసాలమీదనే ఆపైకాలపు వాఙ్మయోత్పత్తివికాసా లాధారపడి ఉంటాయి. అదొక శృంఖల(?) వంటిది. నిజంగా ఆగొలుసు తెగిపోతే, పూర్వోత్తర కాలికము లైన వాఙ్మయాలస్థితి తెలుసుకోవడం చాలా కష్టమైనపని. అల్లాటి వాఙ్మయానికి సరియైన ఫలితం దొరకడం కూడా అరుదే. ఏవిషయమైనా సరే—ఎడతెగకుండా జరుగుతూంటే, దానిఫలావసానాలు తెలుస్తాయి. నడుమ ఆఘాతాలు కల్గితే అంతే శకే మని ఆగిపోతుంది. చూడండి—నన్నయ కాలంలోనె మంగళహారతి పట్టించుకోవలసినది భారతం. కాని నన్నయకవి చనిపోవడంచేత, ఆరచనోద్యోగము మళ్లీ రెండువందలయేళ్లకు గాని ముగింపు కాలేదు. ఇది అనుకరణము లేని లోపము. కాబట్టే, వాఙ్మయాని కనుకరణము తప్పని తద్దినం అన్నాను.

కవులపట్ల మాత్ర మిది మహామారి లాగ కనబడుతూంది. మొదట్లో అది వారిలో 'కళ' లాగ కనబడినా, రానురాను గంగవెఱ్ఱులెత్తి నెత్తికి బరువైంది. కవిలోకానికంతకీ 'బాణోచ్ఛిష్టం జగత్సర్వమ్' అని ఒకబిరుదు ఉండనే ఉంది. ఇదెంతవట్టు నిజమో ఎవరికెఱుక! కాని సూక్ష్మంగా పరిశీలన ముంటేనే కాని, అనుకృతి సాధ్యం కాదు. తా మెవరి ననుకరించవలెనని తలుస్తారో, వారిలో తాము ముఖ్యం దైక్యము కావాలి. ఆతర్వాత కొన్నాళ్ళా విషయాన్ని అభ్యసించాలి. అప్పటికి కాని అనుకృతి పూర్తికాదు. ఎంత అనుకరించినా, విషయం సొంతం కాకపోయినా, శైలీసాహచర్యంచేత విషయం సొంతంలాగ కనుపించడమే అనుకరణంలో కళ అనిపించుకుంటుంది. తిక్కనార్యు డాంధ్రీకరణ కర్తయైనప్పటికీ 'కవిబ్రహ్మ' అనిపించుకొన్న దీమాత్రాన్ననుసరించే. నిజంగా ఆలోచిస్తే—అనుకరణం ఉంటేనే కాని నూత్నత భాసింపనే భాసింపదేమో? కైత చెప్పగలెనంటే, ఏమాత్రమో పూర్వగ్రంథాలు చూడక తప్పదు. చూచినతర్వాత ఆ పూర్వులభావాలు కవికి తెలియకుండానే మొదట విధిపాటుగాను, పిమ్మట పొరపాటుగాను, వెనుక అలవాటుగానూ, కవిత్వంలో ప్రవేశిస్తాయి. తుట్టతుదకు అది మన గ్రహపాటుగా పరిణమిస్తుంది. కాని అది పరిమితమై వెనుక చెప్పినట్లు సొంత మనిపిస్తే 'కళ' ఔతుంది. అనుకరణము కవులలో కొమ్ములు దిరిగిన మహామహులకే తప్పలేదు. లోతుగా చూస్తే—నిజానికి వాల్మీకి ఒక్కడూను, హోమర్ ఒక్కడూ

నూ ఈయనుకరణంబారికి తప్పించుకుంటూ రేమో! కాళిదాసు వాల్మీకి ననుకరించినట్టు లెన్నో ఉన్నాయి. కవిబ్రహ్మగారికికూడా వ్యాసుడే మూలం మైనాడు. 'గొప్పకవి' అనిపించుకోవా లనే కోరిక కల ప్రతికవీ తిక్కనను శతసహస్రవిధాల అనుకరించాడు; అనుకరిస్తున్నాడు. శ్రీనాథుడు పెతినిలో ఉన్న భావనాపటిమను సాటుపడి పట్టుకున్నాడు. కళాపూర్ణోదయకర్త తిక్కనలోని కొల్పని కళలనే కైవసం చేసికొన్నాడు. పోతనార్యు డాతనిలోని భక్తిప్రాభవాన్ని పుణికికొని పోతరించాడు. ఇక నాచనసోమనాథుడు నే నతని 'శిష్యుడను' అని చెప్పుకుంటూనే అతని గడుసుపోకడలన్నిటినీ గడుసుతనంగా చేతికి చిక్కించుకొని, జాతీయతను సంగ్రహించాడు. అనంతామాత్యుడు తిక్కనను అనుకరించవలె నని పడినపాట్లన్నీ అతనిపాత్రంలో ప్రత్యక్షరంలోనూ ప్రత్యక్ష మౌతాయి. శ్రీనాథుడు సంప్రపథమ మంటూ ఏడ్పుకి శ్రీకారం చుట్టాడు. ముక్కుతిమ్మన్న అందుకొని ముద్దుగా సాగించాడు. పెద్దన పెద్దపెట్టున అలపించాడు. అందతినీ చూచి ఏమీ తోచక చేయడాని కింకేదీ లేక అఖరికి భట్టుమూర్తి బావురు మన్నాడు. భట్టుమూర్తి ఏడ్పుకి ప్పేరికి తాళంవేస్తూ తిక్కనకవులు, "శివుడుం దాండవమాడె, నాడెనె పిశాచ భూత భేతాళముల్" అన్నట్లు, చాలమంది తైతక్కలాడినారు, ఈ కాలంలో అధికారులమాటలకి మంచీ చెడ్డా ఎంచకుండా అనధికారులు తాళంవేసి తైతక్కలాడినట్లు. కాళిదాసుకాలమున 'కళ'గ పరిగణింపబడిన అనుకృతి భట్టుమూర్తి పాలనలో మాత్రమంతిమై శగ కైనది. ఏనాడో, ఏతిక్కనకో— భారతం జగద్ధారకం కనుక—హరిహరనాథుడు కలలో కనబడి భారతం చెయ్యమని చెప్పినాడు. అది మొదలు అఖరికి అప్పకవి వఱకు కూడా ప్రతికవికీ దేవుడు కల్లలోనూ, కళ్లలోనూ కనబడి గ్రంథరచనకి, ప్రోత్సహించడమే. (అప్పకవియం ఎవరినీ ఉద్ధరించే దిలేదుగా) ఇంగ్లాండు చూ... కాబోలు—ఆంగ్లకవి ఓస్కార్ వైల్డ్ "అనుకరణ మంతరించినవాడే కళ యవతరించును" Where Imitation ends, there Art Bigins) అని నుడివినాడు. అంతెందుకు? కళాపూర్ణోదయం, పల్నాటివీరచరిత్ర, ఇల్లాటి వేపదో తప్పిస్తే ... వాఙ్మయంలో సంస్కృతాన్ని అనుకరించని పుస్తకా లే ?

అనుకరణము మొగ్గ మొక్కైంది కనుకనే ఆధునిక యుగంలో నవ్యత కనబడుతూ భావకవిత్వం బయలుదేరిం దన్నారు. ఇదిమాత్రము ఇంగ్లీషున కనుకృతి కాదా?' అని చిన్న శంక! భావకవిత్వం కూడా అనుకరణదేవతపాలనలో పెరిగిం దేమో నని సందేహం! ఏమంటారా? సాధారణంగా చాలామంద ప్రయోగాలు కట్టి కొత్త తేటాలాలపించినవారే. ఒకరు కన్నటికాంటాలలో తలమున్కలై కొట్టుకుపోతూంటే, ఇంకొకరు కన్నీటి కాల్వ మూంచివేస్తుంది. ఈవేళ ఒకకవి పెంకమీద పద్యం చెపితే, రేపటికి చిల్లపెంకు మీద ఇంకోపద్యం బయలుదేరుతుంది, పొరుగువర్తకుడు ఉప్పు ఉందంటే, ఇరుగువర్తకుడు పోటీకి పప్పు కూడా ఉన్న దని అరిచినట్లు. ఇంకా చూడండి 'కృష్ణపక్షము' పుట్టి ప్రచారం సాగిస్తూంటే వెంటనే దాన్ని రూపుమాపడానికి 'శుక్లపక్షము' పొడుచుకువచ్చింది. దీనిని అనుకరణపుపోటీ అనక తప్పదు.

అనుకరణంలో కొన్నిగుణాలు విశిష్టంగా కన్పడుతున్నాయి అనుకృతికర్తలు తమకు మూలమైన వారిని మించడం ఒకటి, వారిని నశింపజేయడం ఒకటి. 'శారద'ను చూచి భారతి బయలుదేరింది. బయలుదేరిన 'భారతి' 'శారద'కు స్వస్తి పలికింది. 'హిందూసుందరి'ని జూచి గృహలక్ష్మి వెలసింది. గృహలక్ష్మిధాటీ కాగలేక హిందూసుందరి గుంటపూలు పూస్తూంది. 'వినోదిని'ని వెక్కిరించి 'చిత్రగుప్త' సింగారించుకొంది. 'చిత్రగుప్త'ను చీదరించి నవ్వులతోట' పువ్వులు పూచింది. ఇదంతా పులిని చూచి నక్క వాతపెట్టుకోవడం లాటిది.

భాషావిషయమై చూద్దాము—వాఙ్మయములో లాగే భాషలకు కూడా అనుకరణము సాజముగానే ఉంటుం దేమో నని తోస్తుంది. అన్నిభాషలకీ లేకపోయినా కొన్నిభాషలలో ఉండడం మనం చూస్తూనే ఉన్నాము. 'ఇండోయూరోపియన్, ఇండోజర్మానిక్, ఫిన్నోఉగ్రియన్' మున్నగు భాషాకుటుంబాలీయనుకృతివల్లనే ఏర్పడ్డాయి. జన్యజనకభావానికి వ్యాఖ్య చేస్తే తేలే ఫలితం అనుకరణమే. తెలుగు సంస్కృతజన్య మని కొన్నాళ్ళు వాదించారు అంటే, సంస్కృతా న్ననుకరిస్తుం దని తాత్పర్యార్థము. ద్రావిడజన్య మని మరొక వాదం. కథలో పిట్టకథలాగ దీనిలో ఇంకో చిత్రం. పాశ్చాత్యుల కితరప్రపంచం తెలియనపుడు, భాషలకన్నిటికి 'హీబ్రూ' భాషే తల్లిభాష అన్నారు. జనులందఱు తలలూచారు. కాని హిందూదేశపుగాలి కొట్టినవెనుక హీబ్రూభాషకు తల్లిభాష వేఱే ఉన్న దన్నారు. జనులంతా ఔనంటే ఔనన్నారు. అల్లాగే నన్నయదగ్గఱనుంచి కూడా తెలుగు ప్రాకృత—సంస్కృతజన్య మని వాదు పడింది. జను లలాగే తలాడిస్తు అన్నారు. నడుమ కాల్డువెల్ పండితుడు "తెలుగు ప్రాకృతజన్యము కాదు ద్రావిడభాషాజన్య" మని ఒకవాదము పెట్టాడు. జను లంతా ఆ వాదాన్ని సైతం మెచ్చుకున్నారు. అనుకరణమాహాత్మ్యము! ... వడా, పాలు తాగుతావా! అంటే 'ఊ' అంటాడు. పప్పివిస్తే తింటావా అంటే 'ఊ' అంటాడు. అల్లాగే ఉంది ఈ వరుస!

ఇంకా లోతుకు వెళ్లితే, ఇంకోవిషయం తట్టుతూంది. ఆధునికయుగంలో తెలుగు ముందు ఆంగ్లాన్ని బాగా అనుకరించినది. ... అక్కు పదాలనే చేర్చుకొన్నది. కవిత్వపుపోకడ అనుకరించి 'Lyric Poetry' ని అనుకరించినదే కదా భావకవిత్వము! ఇం... రాజభాష కాబట్టి ఈ అనుకరణదాస్యము తప్పలేదు మనకు. ...టితో ఆగితే బాగానే ఉండును—కాని నడుమ హిందీయుద్యమం 'సర్వము హిందీ ననుకరించాలి' అని ప్రముఖులే పంతం పట్టినా గృహభాష, వృత్తిభాష, వ్యావహారికభాష కూడా హిం...

కావలెనట! చూడండెంత న్యాయంగా ఉందో? ఇంతకీ మూలం తెస్తే చిక్కు విడిపోతుంది. గాంధీగారు "స్వరాజ్యము వచ్చినపుడు హిందీ రాష్ట్రభాష అవడానికవకాశాలున్నాయి. కాబట్టి అందరూ తమ దేశీయభాషలతోబాటు హిందీని కూడా ఆదరించమన్నారు. "హిందీ నభ్యసించండి" అనే తోక పట్టుకుని దేశభాషను చంపి హిందీ నభ్యసింపజేసి, నేల విడిచిన సాము చేస్తూ వెర్రి తలలు వేస్తున్నారు అత్యంత దేశభక్తిపరాయణులూను, అత్యధిక ఔదార్య హృదయులూను అయిన ప్రజలు! ఇది అనుకరణం తడాఖా కాదూ! 'మాచి రమ్మంటే, కాల్చి వచ్చినాడు' అనే సామెత వల్లాంటి గ్రుడ్డిఅనుకరణాలకే చలామణీ అవుతుంది.

సాంఘికంగా చూచినా, అనుకరణప్రభలే వెలిగిపోతున్నాయి. పూర్వకాలంలో మహమ్మదీయులకు భయపడి ముదితలకు ముసుగులు పెట్టారు. ఇప్పుడు మహమ్మదీయభయం తీరినప్పటికీ, అనుకరణప్రభావమువలన ముసుగులు మాటుపడలేదు. మొదట ఏకైక ఘోషా తర్వాత మేకై బిగిసి ఘోషపెట్టుతూ ఉంది. బాల్య వివాహాలేపాపకాలంలో బయలుదేరినాయో కాని, ఒకరిని చూచి ఇంకొకరు గ్రుడ్డెద్దు చేలబడ్డట్లందరూ బాల్యవివాహాలు చేసేవారే. రాజా రామమోహనరాయలు మున్నగు సంస్కర్తల ఉపదేశం విని వారిననుకరించి కొందరు బాల్యవివాహాలు విసర్జించినారు. ఆ మహాసనాతనంలోనుంచి ఒక్క ఉదుటున ఈ మహాసంఘసంస్కరణలోకి దుమికారు ప్రజలు! మాలవాళ్లను చూస్తేనే సచేలస్నానం చేసే రోజులు కొన్ని గడిచాయి. వాళ్లను తాకితే నాలుక తెగ గోసుకొని ప్రాయశ్చిత్తాలు చేసుకొనేవారు. ఆ ఆచార మేమైనదో చెప్పలేము. గాంధీమహాత్ముడు "మాలవాళ్ళూ మనమూ భాయీ భాయీలము, మనలో విభేదాలుండరా" దని శంఖం పూరించాడు. దానితో అనుకరణప్రభావంవల్ల అంటుకుపట్టిన సనాతనాచారాన్ని పీకి కొట్టుకొన్నారు, తిట్టుకొన్నారు. కాని చివరికి గాంధీని విధిగా అనుసరింపవలసివచ్చి హరిజనులతో సాబంతి భోజనబంతులాడుతున్నారు. ఇట్లే విధవావివాహాల విషయాల్లో కూడా ఒకమాదిరి పరంపరానుకరణమే కనబడుతూంది.

చివరకు రాజకీయరంగానికి కూడా అనుకరణావస్థ తప్పలేదు. అదేమని లోక మెరుగకుండానే జనులంతా విదేశవస్త్రాలే ధరించారు. గాంధీజీ ప్రచారకుడై "స్వరాజ్యసాధనకు స్వదేశవస్త్రధారణమే ముఖ్యసాధనము" అని ఉద్ఘోషించినాడు. గడ్డరికప్రవాహంగా జనసామాన్యమంతా స్వదేశీ ధరించి దేశోద్ధారకులనిపించుకొన్నారు—కొన్నాళ్లు మాత్రమే—తత్త్వం తెలిసి చేస్తే ఫలముంటుంది. కాని ఆటకి వీధినాటకంలో వేసుచెట్టుక్రింద నిలిచే ముసలిదానివలె. కాబట్టే అది మూణ్ణాళ్ల ముచ్చటైనది. తెలిసీ తెలియని స్వదేశీబట్టలు కట్టితే తాటాకుమంటలాగ ఆ మురిపెం, ఆజగీ, బిగీ, ఆ ఆటోపమూ పోయి మళ్ళీ మామూలుగా ఎంతమంది విదేశవస్త్రధారులే మిగులుతారు? తత్త్వం గ్రహించి కట్టిన వారెవ్వరూ లేకపోలేదనుకొండీ!

ముఖ్యంగా ముచ్చటించవలసినది నాగరకతానుకరణం! ఈ వేళ బెంగాలీవాళ్లు లోలకులు పెట్టినట్లు ఏ ఫోటోలో ఐనా కనబడితే చాలు, రేపటికల్లా మనవాళ్ళ చెవిని వ్రేళ్లాడవలసినదే. సినిమా విశాల్ చెవికి వజ్రపురింగులు తగిలించుకోవడం చూచి ఈనాడు కొందరు స్త్రీలూ పురుషులూ కూడా అపద్ధతిననుకరించారు. ఇంక ఏ సినిమా నటిని చూస్తే ఆసినిమానటివలె ఉండవలెనని ప్రయత్నం! సన్నటి వాళ్లనందరూ మెచ్చుకుంటున్నారని మూర్ఛపోటూ నిరశనవ్రతం పట్టినా సన్నం కావాలని ప్రజలప్రయత్నం! దైవదత్తమైన శరీరాన్ని కూడా అనుకరణపిశాచి కప్పగిస్తున్నారు. ఇక స్నో, పౌడర్ల మాట చెప్పడం తుపాహాననము. సాటివాడు తొడపాశం కోసుకుంటే, నేను మెడకోసికొంటానన్నట్టే రీతిగా అనుకరిస్తున్నారు.

ఈసందర్భంలో ఒక గాధ జ్ఞాపకం వస్తూంది. పూర్వం ఎప్పుడో ఒక ప్రభుంచిదొర తనమెడమీద లేచిన కురుపునకు కట్టుకోవలసి వచ్చి గుడ్డపేలిక చుట్టితే అందానికి కొలంత అని పట్టుసుమాలొకటి శృంగారంగా ముడివేసుకొన్నాడు. అది చూచి అది ఫ్యాషనికి లాంఛనమనుకొని జనులంతా తమమెడలకి రంగురంగుల గుడ్డపేలికలను వింతవింతగా ముడులువేసికొని "నెక్‌టై" అని పేరు పెట్టారు. అప్పటినుండీ అది నాగరికతాచిహ్నమైపోయి అందరూ 'అజాగళ' అవుతున్నారు.

వంతునకు గంతు వేయుట మీ అనుకరణానికి లోబడే. 'మరాశ దుఃఖానికి నేటు' అనే సామెత పుట్టడానికి ఈ అనుకరణ మొకకారణము. ఎవరైనా ఏదైనా ఘనకార్యం చేసి దానికి తగినఫలం పొందితే వాళ్లననుకరిస్తూ ఇంకొకరాపనే చేసీ కూడా ఆఫలం పొందలేకపోతారు. అప్పుడందరూ 'మరాశ దుఃఖానికి మూలం' అంటారు—ఒకప్పుడు పరీక్షలహాలులో ఒకవ్యక్తి తన మస్తులలో జవాబులకాగితం ఒకటి తెచ్చుకొని అదంతా పరీక్షలో వెళ్ళివ్రాసినదట! అది చూచి ఇంకొకవ్యక్తి అనుసనాడు తన అరికాలిలో జవాబులు వ్రాసికొనివచ్చి కాపీ చేసిందట. అవ్యక్తి చేసిన పుణ్యంకొద్దీ ఆపని వాచర్ కళ్లబడి అవ్యక్తిని 'డిస్మిస్' చేశారట!

భోజనసమయంలో అనుకరణపద్ధతి బాగా ఉపకరిస్తుంది. తెలమువారిలో పంక్తికి మొదట్లో ఒకవృకోదరుని కూర్చోబెడతారు. అవృకోదరుడేది కావాలంటే, తక్కినవారు కూడా అదే కావాలని సిగ్గు విడిచి తుష్టిగా భోజనం చేస్తారు. లోభియైనవాడు ఒక మందభోజిని బంతికి మొదట కూర్చోపెట్టుతాడు. వాని ననుసరించి మిగిలినవారు కూడా మందభోజులే ఔతారు. యజమానికి ఖర్చు తగ్గుతుంది. ఏమి! అనుకరణమాహాత్మ్యము?

'అక్కన్న మాదన్న లందల మెక్కితే, పాటికి సొప్ప చెరుపుగ బెట్టికేనా' అన్నట్లు, అనుకరించలేక డిల్లబోయేవారూ, ఏదో అనుకరించి కసితీర్చుకొనేవారు కూడా ఉంటారు. వెనుక వానికి వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కాసులతో తులాభారం తూగితే, కరణ్ణి కామక్క పుచ్చువంకాయలతో తులాభారం తూగినా

డట!" అనుకరించడానికి తులాభారం తూగడమే ప్రధానమైనది కాని, అందులో న్యూనతాధిక్యాలు పరిగణింపబడలేదు. అనుకరణ వ్యామోహ మిల్లాగే ఉంటుంది.

నాటకా లన్నీ అనుకరణాలే కాదూ? ఎన్నడో కడచిపోయిన దుష్యంతాదుల ననుకరిస్తూ నటకులు సామాజికులకు సత్య మనే భ్రాంతిని కలిగిస్తున్నారు. దుష్యంతపాత్రధారి తనకు చేతనైనంత వఱకూ నిజదుష్యంతుని అనుకరించి తీరాలి. లేకపోతే సామాజికులకు రసవిద్ధి లేనే లేదు. కాబట్టే అభినవప్రహ్లాద, అభినవబాలగంధర్వ, కలియుగభీమ మొదలైన అనుకరణపుబిరుదాలు కనపడుతున్నాయి. ఈబిరుదులు నటకులకే కాదు, తక్కినవారిలో కూడా కనపడుతూంది. "ఆంధ్రచక్రవర్తి, ఆంధ్రభీష్మ, కలియుగద్రోణాచార్య, దానకర్ణ" మొదలైనవి.

పెళ్ళిళ్ళలోకూడా ఈ అనుకరణము కనబడుతూంది. కావుననే పెళ్లికొడుకు ననుకరిస్తూ తోడుపెళ్లికొడుకు, పెళ్లికూతురికి తోడుపెళ్లికూతురు బయలుదేరినారు. తద్దినాలలో కూడా ఈఅనుకరణం తటస్థ మయింది. లేకపోతే, 'తద్దినం పెట్టేవాడి తమ్ముడులాగ 'ఓమా' అంటాడు' అన్న సామెత ఊరికే పుట్టిందా?

అనుకరణ మనేదే లేకపోతే సృష్టి పరిణామము లేక, సర్వకాలమూ ఒక్కతీరునే ఉండవలసివస్తుంది. శిశువు ఎదుగూ బొదుగూ లేక ఎల్లకాలమూ శైశవావస్థలోనే ఉంటుంది. శిశువు తనఅవ్యక్తదశలో తనచుట్టూ ఉన్న ప్రతివస్తువునూ, ప్రతివిషయాన్నీ అత్యంత సునిశితబుద్ధితో గమనించి అనుకరిస్తూ ఒకమహాప్రకృతిశాస్త్ర పరిజ్ఞాతవలె, చారిత్రక పరిశోధకునివలె పరిశీలిస్తూఉంటా డని పదార్థతత్త్వవేత్తలు (Psychologists) పలుకుతారు. మానవుడు తనశత సంవత్సరాల ఆయుఃపరిమితిలోనూ, తాను భూపతనమైన మొదటి ఒక్కసంవత్సరంలో సముపార్జించిన అనుభవాన్నీ తక్కిన 99 సంవత్సరాలలోనూ సంపాదించిన అనుభవాన్నీ త్రాసులో వేసి తూస్తే, మొదటి సంవత్సరంలోని అనుభవంవైపుకే ముల్లు మొగ్గుతుం దని తత్త్వశాస్త్రజ్ఞులు చెప్పుతారు. దీనివలన తేలిన సారాంశ మేమిటంటే, శిశువులు తమచిన్నతనంలో తమచుట్టూ ఉన్న వారిచేష్టలూ, హావభావాలూ, విలాసవిభ్రమాలూ, జాగరూకతతో అనుకరిస్తారనీ, వారికీఅనుకరణజ్ఞానం లేకపోతే వారికి పురోభివృద్ధి ఉండ దనీ బుజువౌతుంది.

ఇలాగే ప్రభువును ప్రజలు అనుకరించాలి. "యథా రాజా తథా ప్రజా" అన్నారు. ప్రభువు కూడా ప్రజల ననుకరించాలి. సామరస్యాన్ని కలుగజేసే ఈ అనుకరణరహస్యం తెలియకపోతే రాజ్యం సుభిక్షంగా ఉండదు. ఒక ఇంట్లో యజమానిని ఇంటివారంతా అనుకరిస్తారు. లేకపోతే గృహచ్ఛిద్రాలు పెరిగిపోతాయి. అల్లాగే భార్య భర్తని, భర్త భార్యని నీడల్లాగ అనుకరించాలి. "అనుకృతి లేని దాంపత్యమూ, అనుశ్రుతి లేని పాటా, అనుపానము లేని వైద్యమూ ఒక్కలాగే ఉంటాయి." అని సామెత కూడా. విదేశాలకి నలుగురితో వెళ్లినప్పుడు వాళ్లందఱూ ఒకరి నొకరు కుండా అనుకరించాలి. లేకపోతే చాల చిక్కులు పడవలసివస్తుంది.

ఈఅనుకరణ మనేది మనుజులలోనే కాక జంతువులలో కన్పడుతూంది. కోతి ముమ్మూర్తులా మనుష్యుని అనుకరిస్తుంది. ప లెప్పుడూ గుంపు విడువకుండా ఒండొంటి ననుకరిస్తాయి. మేతకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు కూడా ఈఅనుకరణం వానిలో కనబడుతుంది. చీమలు గుంపుగా ఉండడమే కాకుండా, తమ నడకలో సైతము తనపైచీమ ననుకరిస్తూ ఆచీమ నడచిన వంకరలలోనే తాను కూడా నడుస్తుంది. పశువులు కూడా మందలు విడువవు. గొఱ్ఱెల అనుకరణము అన్నిభాషల్లోనూ సుప్రసిద్ధమైన న్యాయముగా బడి రూఢమై ఉండిపోయినది. 'గొఱ్ఱెదాటు' 'గడ్డరికాప్రవాహన్యాయమ్' నిజంగా పశుపక్ష్యాదులలో ఈఅనుకృతి లాభదాయకమే.

గ్రామాఫోన్ మనుష్యులకంఠాన్ని అనుకరిస్తూంది. దానినే మనుష్యులు మళ్లీ అనుకరిస్తారు. మనుష్యులని, తిదితిరధ్వనులనీ అనుకరిస్తూ 'ఇమిటేషన్ ఆచార్యులు' బయలుదేరినారు. ఆచార్యులవారి నిజనామము తెలియకపోయినా, వారి మారుపేరుతోనే వ్యవహారం జరిగిపోతూంది. ఈఇమిటేషన్ఆచారిని అనుకరించి మరికొందరు, ఇమిటేషనాచార్యులు కాపీ దిగారు. దాసానుదాసు లన్నట్లు. సిల్కును చూచి ఇమిటేషన్ సిల్కు పుట్టింది. వజ్రానికి కాపీగా ఇమిటేషన్ డైమండు దిగింది. దీనివలన లాభమా! నష్టమా! అంటే, రెండూ లేవు. రెండూ ఉన్నవి.

ఇలాగ చూస్తే ప్రతివిషయములోనూ అనుకరణము కనబడుతూనే ఉంటుంది. దేవతలకే తప్పలేదు ఈఅనుకరణముపాట్లు. సృష్టికర్త బ్రహ్మ తనకాంతామణిని సరస్వతీదేవిని మాటలో మాట ఆమెను వాక్కున ధరించాడు. పాలనాధికారి విష్ణుమూర్తి నేను మాత్రం తక్కువవాడనా అని తన భార్యామణి లక్ష్మీదేవికి వక్షస్స్థలమే కాపురంగా ఇచ్చేశాడు. నీకన్న తక్కువ తిన్న గ్యు డెవ డని లయకర్త పరమశివుడు ఒకభార్యకి పార్వతికి సగంశరీరమూ ధారపోసి, ఇంకోసతిని గంగని నెత్తికెక్కించుకున్నాడు. త్రిమూర్తులకే ఈతిప్పలు తప్పనప్పుడు, మానవు వారు! ఇంతా చేస్తే 'మెత్తనివారిని చూస్తే మొత్తబుద్ధి' అన్నట్లు, ఆంధ్రులు మాత్రము అనుకృతిలో దిట్ట అని ఒక ప్రతీతి ఉంది. ఈఅనుకరణమహాసముద్రంలో ఆంధ్రుల అనుకరణం ఒక ట్టలాంటిది. సృష్టిస్వభావ మేమో అనిపించే ఈఅనుకరణా ఆంధ్రుల నొక్కరినీ గురిచేయడం తగవు కాదు.

ఇంకా వ్రాస్తే, ఈవ్యాసం కూడా దేనికో అనుకరణ టారేమో! ఇక సెలవు.